వెంబడిస్తూ .. దాడులు చేస్తూ



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బాలుడు. ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. తీవ్ర గాయాలపాలైన బాలున్ని గంభీరావుపేట ప్రభుత్వాసుపత్రికి తర్వాత సిరిసిల్ల ఏరియాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.



గంభీరావుపేటలో సంచరిస్తున్న వీధి కుక్కలు



ఈపై చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తిపేరు పిట్ల నర్సింలు. నర్మాల గ్రామానికి చెందిన నర్సింలు జీవనోపాధి కోసం నాటు కోళ్లు పెంచుకుంటున్నాడు. వీధికుక్కలు గుంపులుగా షెడ్‌లోకి దూరి కోళ్లపై దాడి చేసి 200 కోళ్లను చంపాయి. ఉపాధి కోల్పోయి నర్సింలు లబోదిబోమంటున్నాడు.

- వీధికుక్కలు, పందులు, కోతులతో జనం బెంబేలు
- వెంబడిస్తూ దాడులకు దిగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

గంభీరావుపేట: వీధికుక్కల బెడదతో గ్రామాల్లోని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంట్లోంచి పక్క వీధిలోకి వెళ్లాలన్నా.. కిరాణా దుకాణానికి వెళ్లాలన్నా.. భయంగానే ఉంది. నిత్యం తిరిగే ప్రాంతమైనా.. అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతులు. రాత్రివేళ పరిస్థితులు మరీ దారుణంగా పరిణమించాయి. మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రమైంది. వాటిని కట్టడి చేసేవారు కరువై ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఏదో ఒక గ్రామంలో కుక్కలు పిల్లలపై, మహిళలపై, వృద్ధులపై దాడిచేసి గాయపరుస్తూనే ఉన్నాయి. ఇటీవల వాటి సంఖ్య తీవ్రమైంది. ఏ వీధికి వెళ్లినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. కుక్కల స్వైర విహారంతో ప్రజలు ఇళ్లలోనే ఉండాల్సి వస్తోంది. బడి నుంచి తమ పిల్లలు ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులను భయం వెంటాడుతూనే ఉంది. రోడ్లపై వాహనదారుల వెంబడించి మరీ దాడులకు పాల్పడుతున్నాయి.

జీపీ కార్యాలయం ఎదుటే పందులు..

నిత్యం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుటే పందులు గుంపులుగా తిరుగుతున్నా.. అధికారులకు పట్టడం లేదు. ఇటు పంచాయతీ, అటు మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల అధికారులు రాకపోకలు సాగించే రోడ్డుపై పందులు గుంపులుగా కనిపించినా వాటిని కట్టడికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

బాబోయ్ కోతులు..

ఏ వీధిలో చూసినా కోతుల గుంపు కనిపిస్తుంది. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులను ఎత్తుకెళ్లి ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాటిని నివారించే ప్రయత్నంలో అవి తిరుగబడి గాయపరుస్తున్న సంఘటనలు లేకపోలేదు. పిల్లలు, పెద్దలు, మహిళలు చేతిలో కర్రతో తిరగాల్సిన పరిస్థితులు దాపురించాయి.

అధికారుల చర్యలు శూన్యం

కుక్కలు, కోతులు, పందులను కట్టడి చేయడంలో సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పలుచోట్ల వ్యర్థాలు రోడ్డుపక్కనే ఇష్టారాజ్యంగా పడేస్తుండడంతో కుక్కలు వాటిని తింటూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. సంతతి తగ్గించేందుకు గ్రామాల్లో అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భయంగా ఉంది



వీధికుక్కలు, పందులు, కోతుల నియంత్రణపై అధికారులు పట్టించుకోవాలి. ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లలను బయటకు పంపించాలంటేనే భయపడాల్సి వస్తోంది.

– గౌటే గణేశ్, కొత్తపల్లి

చర్యలు తీసుకుంటాం



గంభీరావుపేటలో పందుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. మరోసారి నోటీసులు జారీ చేస్తాం. ఆ తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– వినిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గంభీరావుపేట



ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి–గోపాల్‌పల్లె గ్రామాల మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. చిప్పలపల్లి శివారులో కిలోమీటర్ మేరకు రహదారి పనులను విస్తరించలేదు. సింగిల్‌లైన్‌గా ఉన్న ఈ రోడ్డు గుంతలుపడి ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. కిలోమీటర్ రహదారికి విస్తరణ పనులు, లేదా మరమ్మతులు అయినా చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : లచ్చాలు, ఎంపీడీవో, సెల్: 9989930731.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

సెంట్రల్ లైటింగ్ సిస్టం ప్రారంభం



సిరిసిల్లలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల: పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ సిస్టంను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. రగుడు కలెక్టరేట్ సర్కిల్ నుంచి వెంకటాపూర్ బైపాస్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ వెలుగులు అందుబాటులోకి తీసుకొచ్చామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. పట్టణ పరిధిలోని రగుడు జంక్షన్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తిచేశారు. సీడీఎంఏ నిధులు రూ.4.60 కోట్లతో 11 కిలోమీటర్ల మేరకు 437 స్తంభాలు, నాలుగు హైమాస్ట్ స్తంభాలు ఏర్పాటు చేశారని వెల్లడించారు. దీంతో బై పాస్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, వెంకటాపూర్ గ్రామాల ప్రజలకు సెంట్రల్ లైటింగ్ వెలుగులు అందుబాటులోకి వచ్చాయి. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, స్థానిక నాయకులు గడ్డం నర్సయ్య, యాదగిరి, కమలాకర్ రావు, బొప్ప దేవయ్య, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి



ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు పెన్షన్‌లను పెంచాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. మండలంలోని బండలింగంపల్లిలో మహిళ పెన్షన్‌దారులతో శుక్రవారం లక్ష్మణ్ సమావేశమయ్యారు. ప్రభుత్వం అర్హులైనవారందరికీపింఛన్లు ఇచ్చే విధంగా సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈనెల 13న చలో హైదరాబాద్ సభకు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల కో– కన్వీనర్ మారేపు అంజమ్మ, జిల్లా కన్వీనర్ శోభరాణి, నాయకులు అందే శామ్యూల్, నిర్మల, దేవాచారి, శకుంతల, జ్యోతి, పుష్పలత, లక్ష్మీ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

యూరియా అక్రమంగా తరలిస్తే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రుద్రంగి: యూరియా అక్రమంగా నిల్వ ఉంచినా, తరలించినా చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ యూరియా తరలించకుండా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. రుద్రంగి పరిధిలోని మానాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లే అడ్డంకి



మాట్లాడుతున్న మంద సుదర్శన్

సిరిసిల్లఅర్బన్: స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీ బిల్లుకు ప్రస్తుతం బీజేపీ, బీఆర్‌ఎస్‌లే అడ్డుపడుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ విమర్శించారు. సిరిసిల్లలోని సీపీఐ కార్మిక భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓ వైపు బీసీ బిల్లుకు అడ్డుపడుతూనే బీజేపీ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో 42శాతం బీసీబిల్లుపై చర్చ జరిపి, ఆమోదం తెలపాలన్నారు. నాయకులు పంతం రవి, కడారి రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలి



ఇల్లంతకుంట: ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రమోషన్లతోపాటు బదిలీలు కూడా చేపట్టాలని రాష్ట్ర డీటీఎఫ్ కౌన్సిల్ మెంబర్లు రాజేశ్వరరావు, శ్రీహరి అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టి మాట్లాడారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు డీఏలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు తూముకుంట నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుద్దాల రమేశ్, రాష్ట్ర కౌన్సిలర్ రామేశ్వర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ అశోక్ రెడ్డి, కృష్ణారెడ్డి, హరిప్రసాద్, స్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై గణేశ్

ముస్తాబాద్: నిబంధనలు అతిక్రమిస్తే వాహనాల యజమానులు, డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని ఎస్సై చిందం గణేశ్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఇటీవల కొందరు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, వాహనాలకు ఇన్సూరెన్స్, నెంబర్‌ప్లేటు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమతులు పాటించకుంటే వాహనాల యజమానులతోపాటు డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి: బోయినపల్లి గ్రామపంచాయతీ సిబ్బంది కొత్తకొండ మల్లేశం ఇటీవల మృతిచెందాడు. ప్రభుత్వం తరపున మంజూరైన రూ. 50 వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం బాధిత కుటుంబానికి అందించారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ జయశీల, కార్యదర్శి అనిల్, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, వీసీ వినోద్‌రెడ్డి, నాగుల వంశీ, తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



అనూష (ఫైల్)

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ హామ్లెట్ రేగులపల్లికి చెందిన అనూష (20), అనే వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజకుమార్ శుక్రవారం రాత్రి తెలిపారు. అనూషకు కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కొక్కెరకుంటకు చెందిన మేనబావ బిట్టుతో 2022లో వివాహం జరిగింది. కొంతకాలంగా వేరే కాపురం పెట్టాలనే ఆలోచనతో తల్లిగారింటికి వచ్చింది. ఈ క్రమంలో మనస్తాపంతో గతనెల 23న పురుగుల మందు తాగింది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహితపై అసభ్య ప్రవర్తన

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్‌కు చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజకుమార్ శుక్రవారం రాత్రి తెలిపారు. విలాసాగర్‌లో సదరు వివాహిత తన పిల్లలను స్కూల్ వ్యాన్ ఎక్కిస్తోంది. అదే సమయంలో గ్రామానికి చెందిన సంపత్ అనే వ్యక్తి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ముస్తాబాద్ : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ముస్తాబాద్: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికలకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలభవిత ఆరోగ్య పథకంలో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ రమ్య విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారని ప్రత్యేకాధికారి శ్రీలత తెలిపారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారన్నారు. ఏఎన్‌ఎం దేవలక్ష్మి, ఆశవర్కర్ దేవిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీబీవీ, దమ్మన్నపేట మోడల్ స్కూల్, నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో రమేశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా.మహ్మద్ అఫీజా ఆధ్వర్యంలో బాలభవిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. 91 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.సంపత్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.రామకృష్ణ, లక్ష్మీప్రసన్న, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్ కేజీబీవీ, దుమాల ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్, సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రంగి (కోనరావుపేట): విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మండల వైద్యాధికారి వేణు మాధవ్ అన్నారు. కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బాలభవిత కార్యక్రమంలో భాగంగా డా. వేణుమాధవ్ ఆధ్వర్యంలో కోనరావుపేటలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, ఆశ్రమ పాఠశాల, మరిమడ్లలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు మరిమడ్లలో వైద్య పరీక్షలు నిర్వహించా రు. ఎంఎల్‌హెచ్‌పీలు అరుణ్ చందు, సన్ని హిత, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సెస్ డైరెక్టర్

గంభీరావుపేట: మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సెస్ మండల డైరెక్టర్ గొరినేని నారాయణరావు అన్నారు. మండలంలోని ముచ్చర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ. 6లక్షల అంచనా వ్యయంతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్, గ్రామంలోని పాత లైన్లు తొలగించి కొత్తగా విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు చేపట్టినట్లు తెలిపారు. లూజ్‌వైర్లను సరిచేస్తూ మిడిల్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సెస్ ఏఈ ఆనంద్‌కుమార్, నాయకులు మల్లేశం, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. మండలంలోని కిష్టునాయక్ తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. గ్రామాల్లో లూజ్‌వైర్లు, శిథిలావస్థలో ఉన్న స్తంభాలను మరమ్మతు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఏఈఈ పృథ్వీధర్‌గౌడ్, నాయకులు కొండ రమేశ్ గౌడ్, పిల్లి కిషన్, నమిలికొండ శ్రీనివాస్, ఆకుల మురళిగౌడ్, గుర్రాల రాజిరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, హెల్పర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల: 18నెలల ప్రజాపాలనలో బీఆర్‌ఎస్ పీఠాలు కదులుతున్నాయని, ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో స్కీములన్నీ స్కాములుగా మారాయని గొర్రెల పంపిణీ, చేపల పంపిణీ, దళితబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం పథకాల్లో అవినీతి రాజ్యమేలిందన్నారు. రాజకీయ పునరేకీకరణ పేరిట అప్పటి ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో సీఎం కేసీఆర్ కండువాలు కప్పి ఆహ్వానించిన విషయాన్ని మరిచిపోయి ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై మాట్లాడడం విడ్డూరమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గంలోనే 14,100 రేషన్ కార్డులు అందించామని మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్థికంగా మహిళలను సాధికారత వైపు కాంగ్రెస్ ప్రభుత్వం నడిపిస్తుందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజాసంక్షేమ పాలన ఆగదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆకునూరి బాలరాజు, గోనె ఎల్లప్ప, గడ్డం నర్సయ్య, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, కోడం అమనాథ్, రెడ్డినాయక్, కీసరి నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకే

సిరిసిల్లక్రైం: మద్యంతాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ మహేష్ బీగీతే అన్నారు. శుక్రవారం రాత్రి స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించేలా సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించగా విస్తృత తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుపడితే తల్లిదండ్రులదే బాధ్యతన్నారు. వాహనదారులు, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు.

నేడు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

సిరిసిల్ల టౌన్ : నేతాజీ డిగ్రీ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ జూపల్లి పృథ్వీధర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీల్లో డిజిటల్ మార్కెటింగ్, టెక్నికల్ రిక్రూటర్, రెస్యూమ్ అనలైజర్, హెచ్‌ఆర్ అసిస్టెంట్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. 2022 నుంచి 2025 విద్యా సంవత్సరంలో డిగ్రీ, బీ టెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిరిసిల్ల, బెంగళూరు, హైదరాబాద్ తదితర పట్టణాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 944 1130188, 7013 142129 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో యూరియా కొరతపై కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, వైస్ చైర్మన్ వుచ్చిడి మోహన్ రెడ్డిని మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం కరీంనగర్‌లో కలిశారు. యూరియా కొరత లేకుండా చూడాలని ఆయనను కోరారు. దీనికి కొండూరి సానుకూలంగా స్పందించారు. మాజీ జెడ్పీ కో ఆప్షన్ చాంద్ పాషా, తిప్పవరం భాస్కర్, మాజీ సర్పంచ్ బోయిని రవి, పిట్ల లింబాద్రి ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామపంచాయతీ పరిధి గాంధీనగర్‌లో శుక్రవారం కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేశారు.భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ సొంత ఖర్చులతో నాలుగు హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కేటీఆర్ సేన నాయకులు తాటి శివ, మామిడాల విజయ్, బండి ప్రశాంత్, అమర గొండ కృష్ణ, ఎండీ.ఇమామ్ పాల్గొన్నారు.

బీమా పథకాలతో భరోసా

రుద్రంగి(కోనరావుపేట): భీమా పథకాలతో కుటుంబాలకు భరోసా అని యూనియన్ బ్యాంక్ అధికారులు సూచించారు. కోనరావుపేట మండలం వట్టిమల్లలో యూనియన్ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎంఎస్బీవై, పీఎంజేజేబీవై, అటల్ పెన్షన్ యోజన పథకాలను నమోదు చేశారు. యూ నియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వంశీ, బీసీ కమటం ఆదర్శ్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

చందుర్తి : దేవుని తండా కమిటీ అధ్యక్షుడిగా అజ్మీరా గణేశ్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అజ్మీరా రాజు, ప్రధాన కార్యదర్శిగా నూనవత్ దేవేందర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుక్యా గోపాల్, నూనవత్ బుక్యా, నూనవత్ మోబిలాల్, బానవత్ పుల్ సింగ్, నూనవత్ గెన్యా, బుక్యా రాములు, అజ్మీరా రాజు నూనవత్ బీమ్లాలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

సిరిసిల్ల టౌన్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ సింగరవేణి పద్మ అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని నెహ్రూనగర్ 5వ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు, తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. అప్పుడే పుట్టిన చిన్నారులకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఏఎన్‌ఎం సమాంజలి, ఆశాలు అనిత, అన్నపూర్ణ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

• అన్నదానం

వేములవాడ : కోర్టు ఆవరణలో అడ్వేకట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జ్ అజయ్‌కుమార్ జాదవ్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గౌరు రాజిరెడ్డి, విక్రాంత్, ఏజీపీలు బొడ్డు ప్రశాంత్, భానుప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి కలిసి ప్రారంభించారు. సూపరింటెండెంట్ అంజయ్య, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

• బాధ్యతలు స్వీకరణ

గంభీరావుపేట: మండల ఐకేపీ ఏపీఎంగా దేవయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన సుదర్శన్ వీర్నపల్లికి బదిలీ కాగా.. ముస్తాబాద్ నుంచి దేవయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ ఐకేపీ ఏపీఎంగా జయసుధ బాధ్యతలు చేపట్టారు. ఏపీఎం దేవరాజు గంభీరావుపేటకు బదిలీ అయ్యారు. బోయినపల్లి ఏపీఎంగా పనిచేస్తున్న జయసుధను అధికారులు ముస్తాబాద్‌కు బదిలీ చేశారు. రెండేళ్ల క్రితం జయసుధ ఇక్కడే ఏపీఎంగా పనిచేసి బదిలీ అయ్యారు.

వీర్నపల్లి: మండల ఏపీఎంగా సుదర్శన్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించిన నరసయ్య ఎల్లారెడ్డిపేటకు బదిలీపై వెళ్లారు.

• సమ్మె నోటీస్ అందజేత

గంభీరావుపేట: మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6, 7 సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు సమ్మె నోటీసును మండల మధ్యాహ్న భోజన కార్మికులు మండలవనరుల కేంద్రంలో శుక్రవారం అందించారు. రాజమణి, మహేశ్వరి, రేఖ, జ్యోతి, సునిత, లక్ష్మీ,తదితరులున్నారు.

• అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్

వేములవాడ: వేములవాడ పట్టణ ప్లంబర్స్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శంశొద్దీన్, ఉపాధ్యక్షుడిగా రంజాన్, కోశాధికారిగా జాకీర్, కార్యవర్గ సభ్యులుగా ఎన్. ప్రవీణ్, డి.ప్రసాద్, రఫీక్, సల్మాన్, ప్రభాకర్, యూసుఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అబ్దుల్ రజాక్‌ను ఘనంగా సన్మానించారు.

• బెదిరింపులకు పాల్పడ్డ వారిపై ఫిర్యాదు

చందుర్తి: మండల కేంద్రం శివారులోని 450 ట్యాంకు కెనాల్ నిర్మాణంలో భూ నిర్వాసితులు రోడ్డును, కెనాల్‌ను ధ్వంసం చేసి రోడ్డుపై వెళ్లితే చంపుతానని బెదిరిస్తున్నారని మల్యాలకు చెందిన ముగ్గురు రైతులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన మొత్కుపల్లి తిరుపతి, మొత్కుపల్లి గంగాధర్, బురక కొమురయ్య, బురక ఎల్లయ్య, పోతరాజు రాజేందర్‌ల భూమి 2.34 ఎకరాలు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 450 ట్యాంకు ఆర్‌బీసీ కెనాల్‌లో ముంపునకు గురైంది. ఈ భూమిలో నుంచి కెనాల్‌తోపాటు రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును, కెనాల్‌ను ధ్వంసం చేసి అటుగా వెళ్తే చంపుతానని బెదిరిస్తున్నారని మల్యాలకు చెందిన పత్తిపాక మల్లయ్య, జంగిలి తిరుపతి, జంగిలి రమ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

• ఇసుక తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్: ఆవునూర్ మానేరు వాగునుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యజమానితోపాటు, డ్రైవర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మానేరు వాగునుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రామలక్ష్మణపల్లెకు చెందిన ట్రాక్టర్ యజమాని పాక రామస్వామి(40), వెంకటాపూర్‌కు చెందిన డ్రైవర్ మామిండ్ల పర్శరాములు(38)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.